సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 20 । జనవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అంకం వీరభద్ర రావు, భాగ్యలక్ష్మి దంపతులు (పుల్లేటికుర్రు) రూ.50 వేల విరాళం సమర్పించారు.



తపోవనం సందర్శన

తుని రూరల్: తుని మండలం కుమ్మరి లోవలో సచ్చిదానంద తపోవనం ఆశ్రమాన్ని కాశీ విశ్వేశ్వర ఆలయం ప్రధాన అర్చకులు శ్రీకాంత్ మిశ్రా గురువారం సందర్శించారు.

డెల్టాలకు 9,450 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,450 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,850, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 7.80 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఏమ్మా.. బాగున్నావా..



సరస్వతిని పరామర్శిస్తున్న ఎంపీ భరత్ రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏమ్మా.. బాగున్నావా, సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ మహిళను ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆప్యాయంగా పలకరించారు. రాజమహేంద్రవరంలోని 46వ డివిజన్‌లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పి.సరస్వతి అనే మధుమేహ బాధితురాలిని పరామర్శించారు. ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు.

ఘనంగా వేమన జయంతి



వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సమాజంలోని రుగ్మతలపై పోరాడిన మహోన్నతుడు వేమన అని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సమాజం, మానవ సంబంధాలపై వేమన పద్యాలు రాసి 350 ఏళ్లు అవుతున్నా.. అవి నేటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వేమన జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు మాట్లాడుతూ సత్యసాయి జిల్లా కదిరి మండలం కటారిపల్లెలో వేమన సమాధి ఉందన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి తన రచనల ద్వారా చాటిన గొప్పవ్యక్తి వేమన అన్నారు. ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానికంగా ఉన్న స్కానింగ్ సెంటర్లను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లోనూ ధరల పట్టిక, సేవల వివరాలు, నిబంధనల బోర్డు ప్రదర్శించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారా అనే సమాచారం తెలుసుకునేందుకు కొందరు గర్భిణులను స్కానింగ్ సెంటర్లకు పంపారు. సెంటర్ల నిర్వహణకు అనుమతి పత్రాలు, రిపోర్టులను తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ లూసీ కార్డీలియా మాట్లాడుతూ అనుమతి లేని స్కానింగ్ సెంటర్లపై సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీహెచ్‌ఈవో నాగు, సత్యకుమార్, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

పేదల గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కాకినాడ సిటీ: పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి గురువారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఉగాది రోజున తలపెట్టిన సామూహిక గృహప్రవేశాల కార్యక్రమానికి పనులు పూర్తి చేయాలన్నారు. ఆప్షన్-3 కింద జిల్లాలో సుమారుగా 16,300 గృహాల మ్యాపింగ్ చేశామన్నారు. ఈ గృహాలన్నింటినీ త్వరితగతిన గ్రౌండింగ్ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళా లబ్ధిదారులను గుర్తించి రుణాల మంజూరు ప్రక్రియ చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, సీపీవో పి త్రినాథ్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, హౌసింగ్ పీడీ బి సుధాకర్ పట్నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాసు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.సూర్యప్రకాష్‌రావు, కాకినాడ, పెద్దాపురం డివిజన్ల డీఎల్డీవోలు పి.నారాయణమూర్తి, ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ కృతికా శుక్లా కాకినాడ పట్టణం, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, ఇతర మున్సిపాలిటీలలో గృహ నిర్మాణాల పురోగతిని లేఅవుట్ల వారీగా హౌసింగ్, మెప్మా, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు.

గనుల లెక్క తేలింది

- గనుల శాఖ విభజనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- అమలాపురం, రంపచోడవరాల్లో జిల్లా స్థాయి ఏడీ కార్యాలయాలు
- రాజమహేంద్రవరం, కాకినాడల్లో యథాతథంగా కొనసాగింపు
- ఉమ్మడి జిల్లాలో 185 చిన్న, పెద్ద తరహా ఖనిజాలు
- కొలిక్కి వచ్చిన విభజన ప్రక్రియ
- ప్రత్యేక కార్యాలయాల ఏర్పాటుకు మార్గం సుగమం

సాక్షి, రాజమహేంద్రవరం: గనుల శాఖ లెక్క తేలనుంది. ఏ జిల్లా పరిధిలోని గనులను ఆదే జిల్లా కేంద్రంగా పర్యవేక్షించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడిగా ఉన్న ఆ శాఖ కార్యాలయాల విభజనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇటీవల అధికారిక ఉత్తర్వులను వెలువరించింది. అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలపై స్పష్టత రాగానే జిల్లా కేంద్రంలో కార్యాలయాలు ప్రారంభం కానున్నాయి. అధికారుల కేటాయింపు, క్వారీల విభజన తదితర అంశాలపై ఇప్పటికే ఓ స్పష్టతకు వచ్చింది. అతి త్వరలోనే కొత్త కార్యాలయాలు కొలువుదీరేందుకు మార్గం సుగమం కానుంది.

ఇదీ సంగతి

ఉమ్మడి తూర్పుగోదావరి మూడు జిల్లాలుగా ఆవిర్భవించింది. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలీనమైంది. జిల్లా పునర్విభజన అనంతరం ఎక్కువ ప్రభుత్వ శాఖలను ఆయా జిల్లాల వారీగా విభజించారు. గనుల శాఖ మాత్రం ఉమ్మడిగానే కొనసాగుతోంది. శాఖ విభజన విషయమై కొన్ని నెలలుగా కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని క్వారీలు, గనుల పర్యవేక్షణ కాకినాడ, రాజమండ్రి కేంద్రంగా సహాయ సంచాలకులు చూస్తున్నారు. ఇకపై ఏ జిల్లా పరిధిలో క్వారీలను ఆ జిల్లా అధికారులే బాధ్యత వహించేలా ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు త్వరలోనే స్పష్టత రానుంది.

ఉమ్మడి తూర్పులో ఇలా..


ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 185 చిన్న, పెద్దతరహా ఖనిజాలు ఉన్నాయి. వీటి లీజులు పొందిన నిర్వాహకులు క్వారీలు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి తూర్పులో 64 మండలాలు ఉండగా.. వీటిని రాజమహేంద్రవరం, కాకినాడ డీడీ, ఏడీల పర్యవేక్షణలో నడుస్తున్నాయి. రంపచోడవరం, చింతూరు ఏజెన్సీలోని గనులు, క్వారీలన్నీ ఈ రెండు కార్యాలయాల పరిధిలోనే నడుస్తున్నాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లా నాలుగు జిల్లాలుగా విడిపోయింది. అన్ని శాఖ మాదిరిగా ఈ శాఖను తమ పరిధిలో మైనింగ్ బాధ్యతలను అప్పగించినా ఇంకా సాంకేతిక విభజన జరగలేదు. ఫలితంగా ఖనిజాభివృద్ధి నిధి(డీఎంఎఫ్) జిల్లాలకు సక్రమంగా అందుబాటులోకి రావడం లేదు. నిధులతో ప్రతిపాదించిన పనుల్లో స్తబ్దత నెలకొంది. ఫలితంగా అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతోంది. ఈ పరిణామంతో గనుల శాఖ విభజన అధికారికం చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.

అమలాపురం, అల్లూరిలో కొత్తగా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రాల్లో కొత్తగా రెండు ఏడీ(అసిస్టెంట్ డైరెక్టర్) కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. విశాఖలో ఉన్న ఉప సంచాలకుని కార్యాలయం అల్లూరికి, ఏలూరులోని ఏడీ కార్యాలయం అమలాపురానికి తరలించనున్నారు. ఈ మేరకు త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఇప్పటి వరకు అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు ఏజెన్సీలు రాజమహేంద్రవరం ఏడీ పర్యవేక్షణలో జరిగేవి. తాజా నిర్ణయం ప్రకారం ఆ జిల్లా కేంద్రంలో కొత్తగా ఏడీ కార్యాలయం ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

గనుల తవ్వకాలు ఇలా..

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనులకు అత్యంత ప్రాధ్యానత ఉండేది. కొవ్వూరు, దేవరపల్లి, కోరుకొండలో గ్రామాల్లో బ్లాక్ మెటల్ మైనింగ్ జరుగుతోంది. గోకవరం మండలం మల్లవరంలో బ్లాక్‌మెటల్ ఉండగా.. అది నాలుగేళ్ల క్రితం మూసేశారు. ప్రస్తుతం అష్టలక్ష్మి గుడి వద్ద రెడ్ గ్రావెల్ జరుగుతోంది.
- రంపచోడవరం ఏజెన్సీ పరిధిలో గంగవరం మండలం అడ్డతీగలలో బ్లాక్ మెటల్ ఉన్నాయి. ఇవి లైసెన్స్ ట్రైబల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.



గోకవరం మండలం కృష్ణునిపాలెం వద్ద తవ్వకాలు

- 2014–15 కాలంలో గోకవరంలో లేటరైట్ మైనింగ్ జరుగుతుండగా ఇప్పుడు అది మూత పడింది. గుర్తేడులో సైడ్ బాక్సైట్ ఖనిజం ఉంది. కానీ తవ్వేందుకు అనుమతులు ఇవ్వలేదు. చింతూరులో క్వార్ట్జ్ తవ్వకాలు జరుగుతున్నాయి.
- ప్రత్తిపాడు మండలం వంతాడలో అత్యంత డిమాండ్, ఖరీదైన లేటరైట్ తవ్వకాలు జరుగుతున్నాయి. రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ తదితర తవ్వకాలు ఊపందుకునేవి. వీటన్నింటికి రాజమహేంద్రవరం, కాకినాడ కేంద్రంగా పర్యవేక్షిస్తున్నారు.
- పెద్ద సంఖ్యలో ఉన్న క్వారీలు, గనుల తవ్వకాలకు పర్మిట్లు జారీ చేయడం, అక్రమ రావాణాపై దాడులు చేయడం ప్రస్తుతమున్న అధికారులకు కష్టతరంగా మారుతోంది. వీరి కదలికలపైనా అక్రమార్కులు నిఘా పెట్టి మరీ మైనింగ్‌కు పాల్పడుతున్నారు.
- కొన్ని చోట్ల అధికారులు సైతం మైనింగ్ మాఫియాతో చేతులు కలిపి అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారు. అక్రమ తవ్వకాలు జరుగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పర్యవేక్షణ సులభతరం కానుంది.

ప్రక్రియ జరుగుతోంది

గనుల శాఖ విభజన ప్రక్రియ జరుగుతోంది. ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు సైతం విడుదల చేసింది. ఉమ్మడి తూర్పులో రెండు ఏడీ కార్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదన ఉంది. త్వరలోనే ప్రక్రియ అమలయ్యే అవకాశం ఉంది.

- ఎం.విష్ణువర్ధన్, ఏడీ గనుల శాఖ, రాజమహేంద్రవరం

సచివాలయాలతో మెరుగైన పౌరసేవలు

కలెక్టర్ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సగటున ప్రతి రోజూ 91.19 శాతం పౌరసేవలు అందిస్తున్నామని కలెక్టర్ మాధవీలత అన్నారు. రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులు, హౌస్ సైట్లు, స్పందన, జీపీఎంపీ, పౌర సేవలపై గురువారం వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా గత వారంలో 45,385, ఈ వారం 46,690 పౌర సేవలు అందించగలిగామన్నారు. రాష్ట్ర సగటు 61.34గా ఉందని, మరింతగా పౌర సేవలు పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కార్యాచరణ ప్రణాళిక

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 23 నాటికి 10 గ్రామాల్లో సర్వే చేపట్టాల్సి ఉండగా, ఇప్పటికే 8 గ్రామాల్లో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను పూర్తి చేశామన్నారు. జిల్లాలో పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన కోసం 941.3 ఎకరాలకుగాను క్షేత్రస్థాయిలో 337 ఎకరాల్లో మ్యూటేషన్ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రాప్ నమోదుకు సంబంధించి 90,024 ఎకరాలకు 83,184 ఎకరాలు పూర్తి చేశామన్నారు. జగనన్న పాలవెల్లువ 49 యూనిట్లలో 35 యూనిట్ల ద్వారా ప్రతిరోజూ సగటున 3,093 లీటర్ల పాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఉగాదికి నిర్దేశించిన లక్ష్యాల్లో 68 శాతం మేర ప్రగతి పథంలో ఉన్నట్లు తెలిపారు. 25,030 స్వయం సహాయక సంఘాలకు గృహ రుణాలు ఇచ్చామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కింద 984 పనులకు గాను 956 పనులకు పరిపాలన ఆమోదం లభించిందని, వాటిలో 885 పనులు ప్రారంభించామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని, దేశభక్తి ప్రతిబింబించేలా పకడ్బందీగా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ మాధవీలత అధికారులకు ఆదేశించారు. రిపబ్లిక్ డే ఏర్పాట్లపై గురువారం రాత్రి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, అదనపు ఎస్పీ రజనీతో కలిసి కలెక్టర్ మాధవీలత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజమహేంద్రవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారి గణతంత్ర వేడుకలు జరుపుకొంటున్నామన్నారు. పోలీస్, రెవెన్యూ, కార్పొరేషన్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. తొమ్మిది శాఖల వాహన శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయడంపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. జనవరి 26న జిల్లాస్థాయి జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో తప్పనిసరిగా అధికారులు, సిబ్బంది పాల్గొనాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందస్తుగా ప్రదర్శన ఇచ్చేవారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వేడుకల ఏర్పాట్లకు సంబంధించి కార్పొరేషన్ కమిషనర్, జాయింట్ కలెక్టర్ బాధ్యత తీసుకోవాలన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా 23, 24, 25 తేదీల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జనవరి 26న జరిగే వేడుకలకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కానిస్టేబుల్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రాజమహేంద్రవరం పరిధిలో 29 కేంద్రాలు



పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశమైన రీజినల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. టేకి, చిత్రంలో నన్నయ రిజిస్ట్రార్ అశోక్ తదితరులు

రాజానగరం: పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఆదివారం నిర్వహించనున్న పోలీసు కానిస్టేబుళ్ల పరీక్షకు రాజమహేంద్రవరం పరిధిలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు పూర్తి చేశామని రీజినల్ కోఆర్డినేటర్, 'నన్నయ' వర్సిటీ ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి తెలిపారు. నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఈసీ హాలులో పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్స్‌తో గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. రాజమహేంద్రవరం పరిధిలోని కళాశాలలు, యూనివర్సిటీ ప్రాంగణంతో పాటు అనపర్తి, కొవ్వూరులోని కళాశాలల్లో ఏర్పాటుచేసిన 29 కేంద్రాలలో 12,424 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్ష కేంద్రానికి హాల్ టిక్కెట్‌తో పాటు ఐడీ ప్రూఫ్‌ని కూడా వెంట తీసుకుని ఉదయం 9 గంటలకే చేరుకోవాలన్నారు. 10 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, క్రైం బ్రాంచ్ ఏఎస్పీ జి. వెంకటేశ్వర్రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు రామ్‌వర్మ, వెంకటేశ్వర్రావు, సీఐ పి. కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలతో సమాజ వికాసం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: సమాజ వికాసానికి బుద్ధుని బోధనలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. అమరావతి బుద్ధవిహార్ సౌజన్యంతో సద్దమ దీపిక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బౌద్ధ భిక్షువు బంతే దామ్నా దజథేరో రూపొందించిన న్యూ ఇయర్ క్యాలెండర్‌ను రాజమహేంద్రవరంలోని తన చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ అహింస, శాంతిని అందించే బుద్ధుని బోధనలు నేటి ఆధునిక కాలంలో మానవాళి వివిధ రకాల ఒత్తిడులను అధిగమించడానికి, ప్రశాంత జీవనం పొందడానికి తోడ్పడతాయన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సమీపంగా ఉన్న బౌద్ధక్షేత్రం, పాండవుల మెట్ట ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈ ప్రాంతాల నుంచి స్వామివారి కొండ పైకి రోప్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు.

సబ్జెక్టు టీచర్ల కొరతకు చెక్



- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల సర్దుబాటు
- కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయుల చేరిక
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 359 మంది సర్దుబాటు

రాయవరం: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతకు ప్రభుత్వం చెక్ పెట్టే దిశగా చర్యలు చేపట్టింది. త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంది. దీంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యాంశాల బోధన అందనుంది. తాత్కాలిక పదోన్నతులకు గురైన ఉపాధ్యాయులు శుక్రవారం విధుల నుంచి విడుదలై నూతనంగా అలాట్ అయిన పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు.

359 మంది టీచర్లకు ఉత్తర్వులు

గతేడాది అక్టోబర్ 12న ఉపాధ్యాయుల పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు తాత్కాలిక సర్దుబాటులో భాగంగా స్థానాల కేటాయింపు చేపట్టారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఈ నెల 13న రాజమహేంద్రవరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో గతంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల్లో ఇంగ్లిష్ 177, గణితం 76, బయాలజీ 53, సోషల్ స్టడీస్ 52 మందిని తాత్కాలికంగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆయా సబ్జెక్టు టీచర్ల స్థానాల్లో సర్దుబాటు చేశారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చేందుకు ఇచ్చిన హామీ నెరవేరినట్లైంది.

అయినప్పటికీ ఇంకా సబ్జెక్టు టీచర్ల కొరతను గుర్తించిన రాష్ట్ర విద్యాశాఖ డీఎస్సీ కోసం కేటాయించిన 30 శాతం ఖాళీలను కూడా భర్తీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈ నెల 18న కాకినాడ ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో పదోన్నతులకు అన్‌విల్లింగ్ ఇచ్చిన ఎస్జీటీలకు సబ్జెక్టు టీచర్లుగా బోధన చేసేందుకు మరో అవకాశం కల్పించారు. ఈ విధంగా ఇంగ్లిష్ 47, బయాలజీ 18, గణితం 44 ఖాళీలను ఎస్జీటీలతో సర్దుబాటు చేశారు. ఇలా సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయుల్లో అధిక శాతం ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు **అనాసక్తి కనబర్చారు. మూడు సబ్జెక్టులకు కలిపి కేవలం 16 మంది మాత్రమే విల్లింగ్ ఇచ్చారు. దీంతో గతంలో పదోన్నతి పొందిన 343 మందితో పాటు, సబ్జెక్టు టీచర్లుగా వెళ్లేందుకు ఆసక్తి కనబర్చిన 16 మందితో కలిపి మొత్తం 359 మందికి** సర్దుబాటు ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది.

రూ.2,500 అలవెన్స్

తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉన్నత పాఠశాలల్లో బోధన చేసే సబ్జెక్టు టీచర్లకు ప్రభుత్వం సబ్జెక్టు టీచర్ల అలవెన్స్‌గా రూ.2,500 చెల్లించనుంది. ప్రస్తుతం వారు పొందుతున్న వేతనానికి అదనంగా ఎస్‌టీఏను చెల్లిస్తారు. వీరంతా ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచే వేతనాలు పొందనున్నారు. బదిలీల ప్రక్రియలో న్యాయపరమైన సమస్యల పరిష్కారం అనంతరం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన స్థానాలు కేటాయించే అవకాశముంది. సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయులు శుక్రవారం ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవై వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంది. ఇది కేవలం సర్దుబాటు ప్రక్రియగా మాత్రమే ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొత్త పాఠశాలల్లో విధులకు హాజరు కావాలి



సర్దుబాటు ప్రక్రియకు గురైన ఉపాధ్యాయులంతా కొత్త పాఠశాలల్లో శుక్రవారం విధుల్లో చేరాల్సి ఉంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేశాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 359 సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేశాం. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎస్జీటీల సర్దుబాటు ప్రక్రియను మండల విద్యాశాఖాధికారులు ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తారు.

– ఎస్.అబ్రహం, డీఈవో, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

క్వారీ లారీ ఢీకొని వ్యక్తి మృతి

రంగంపేట: క్వారీలారీ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం తెల్లవారు జామున రంగంపేట మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన సోమిశెట్టి రాముడు (60) దుంపలు అమ్ముకోవడానికి సైకిల్‌పై సోమిశెట్టి వీరబాబుతో కలసి ఇంటి నుంచి బయలుదేరి పెద్దాపురం వెళుతున్నాడు. సింగంపల్లి శివారు సత్తెమ్మతల్లి తాడి దగ్గర గల హోటల్‌లో టీ తాగడానికి ఆగాడు. టీ తాగుతుండగా రామేశంపేట వైపు నుంచి సింగంపల్లి వైపు వెళుతున్న క్వారీలారీ వేగంగా వచ్చి రాముడు, వీరబాబులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాముడు అక్కడికక్కడే మృతి చెందగా వీరబాబుకి గాయాలు అయ్యాయి. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాండ్‌బాల్ నేషనల్స్‌కు దీపక్‌చక్రీ



తుని: స్థానిక శ్రీప్రకాష్ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.దీపక్‌చక్రీ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక య్యాడు. శ్రీప్రకాష్‌లో 10వ తరగతి చదువుతున్న దీపక్‌చక్రీ ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ జిల్లా గన్నవరం హైస్కూల్లో జరిగిన 44వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జూనియర్ బాలుర విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 26 నుంచి 31 వరకూ తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లిలో జరిగే 44వ జాతీయస్థాయి పోటీల్లో దీపక్‌చక్రీ పాల్గొంటాడని పాఠశాల హెచ్ఎం డీవీ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థి దీపక్‌చక్రీని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, కోచ్‌లు బాలరాజు, సురేష్ అభినందించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మారూఫ్

తుని: సంక్రాంతి పండగకు సొంత ఊరికి వచ్చిన ఆయన.. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి తిరుగు ప్రయాణంలో వెళుతూ రైలు నుంచి జారిపడి మృత్యువాత పడ్డారు. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి తుని జీఆర్పీ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా జొన్నగడ్డ గుడ్డి గ్రామానికి చెందిన కె.కోటేశ్వరరావు(46) కాకినాడ జిల్లా గొల్లప్రోలు–పిఠాపురం రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన చిత్తూరు జిల్లా పాకాల కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సంక్రాంతి పండగకు సొంత ఊరికి వచ్చి భార్యాపిల్లలతో ఉండి డ్యూటీలో చేరడానికి రైలులో వెళుతుండగా ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. మృతుడి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియపరిచి, కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

రూ.14.4 కోట్ల చికెన్ లాగించేశారు

- గ్రామ దేవతలకు ఘనంగా నైవేద్యాలు
- సంక్రాంతి పండగ మూడు రోజుల్లో 4.5 లక్షల మేర కోళ్ల అమ్మకాలు



మండపేట: సంక్రాంతి పండగల నేపథ్యంలో కోళ్ల అమ్మకాలు భారీగా జరిగాయి. గత మూడు రోజుల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మాంసాహార ప్రియులు రూ.14.4 కోట్ల విలువైన చికెన్ లాంగించేసినట్టు అంచనా. ఈసారి కనుమ పండగ సోమవారం రావడంతో అందరూ ఒకేరోజు కాకుండా వీలునుబట్టి నైవేద్యాలు సమర్పించుకోవడంతో అమ్మకాలు మూడురోజుల పాటు జరిగాయని వ్యాపారులు అంటున్నారు. మూడు రోజుల పండగ ముగియడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు తిరుగు ప్రయాణాల్లో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండగల్లో చివరిదైన కనుమ రోజున ప్రతీ ఇంట గ్రామదేవతలకు కోళ్లను కోసి నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ.

చికెన్ షాపులు కిటకిట

ఈ ఏడాది కనుమ పండగ సోమవారం రావడంతో నైవేద్యాల సమర్పణ శివభక్తులకు ఆటంకంగా మారింది. కొద్దిమంది సోమవారం నైవేద్యాలు సమర్పించుకోగా మిగిలిన వారు మంగళ, బుధవారాల్లో సమర్పించుకున్నారు. దీంతో మూడు రోజులు చికెన్ షాపులు వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు దాదాపు రెండు లక్షల కిలోల చికెన్ వినియోగమవుతుందని అంచనా. సంక్రాంతి పండగల నైవేద్యాల నేపథ్యంలో మూడు రోజులు 50 శాతం మేర అమ్మకాలు పెరిగినట్టు వ్యాపార వర్గాలంటున్నాయి. ఈ మేరకు సోమ, మంగళ, బుధవారాల్లో తొమ్మిది లక్షల కిలోల చికెన్ అమ్ముడుపోయినట్టు అంచనా. ఇందుకోసం రెండున్నర కిలోల బరువు కలిగిన 4.5 లక్షల కోళ్లు తెగిపడ్డాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో లైవ్ కిలో రూ.112లు ఉండగా ఒక్కో కోడికి రూ.280 వరకు ఖర్చవుతుంది. ఈ మేరకు మూడు రోజుల్లో 12.6 కోట్లు మేర అమ్మకాలు జరిగాయి. లేయర్ అమ్మకాలు కూడా జోరుగా సాగాయి. జిల్లాలోని మండపేట, పెద్దాపురం, అనపర్తి, తుని తదితర ప్రాంతాల్లో 200 పౌల్ట్రీలు ఉండగా రెండు కోట్ల వరకు కోళ్లు ఉన్నాయి. సాధారణంగా రోజుకు 25,000 వరకు గుడ్లు పెట్టని లేయర్ కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. పండగల నేపథ్యంలో మూడు రోజులు 80శాతం మేర అమ్మకాలు పెరిగి 1.2 లక్షల కోళ్ల అమ్మకాలు జరిగినట్టు వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో లేయర్ కోడి రూ.150 ధర పలుకుతోంది. ఈ మేరకు రూ.1.8 కోట్లు లేయర్ కోళ్ల అమ్మకాలు జరిగాయి. పండగల మూడు రోజుల్లో రూ.14.4 కోట్లు విలువైన బ్రాయిలర్, లేయర్ కోళ్ల అమ్మకాలు జరిగినట్టు వ్యాపారులు అంటున్నారు.

అమ్మకాలు బాగున్నాయి

ఈసారి కనుమ పండగ సోమవారం రావడంతో తక్కువ మంది మాత్రమే ఆరోజు నైవేద్యాలు పెట్టుకున్నారు. అధిక శాతం మంది మంగళ, బుధవారాల్లో సమర్పించుకున్నారు. పండగల నేపథ్యంలో అమ్మకాలు బాగా జరిగాయి.

– బొబ్బా వెంకన్న, బ్రాయిలర్ కోళ్ల రైతు, మండపేట

శిక్షణ పొందడం అదనపు అర్హత

ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్



ఆపద మిత్రల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సామర్లకోట: ప్రకృతి వైపరీత్యాల పట్ల ఆపద మిత్రలు అప్రమత్తంగా ఉండే విధంగా వారికి శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణ వారికి అదనపు అర్హతగా ఉంటుందని ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో గురువారం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలోని ఆపద మిత్రలకు 12 రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆయన ప్రారంభించారు. వలంటీర్లు, ఆశావర్కర్లు, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి ఉత్సాహంగా ఉన్న వారిని ఆపద మిత్రలుగా ఎంపిక చేశామన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితులను ఆదుకొనేవిధంగా ఆపద మిత్రలు పని చేయవలసి ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా శాఖల్లో అనుభవం కలిగిన డాక్టర్లు, అగ్నిమాపకశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, విపత్తుల శాఖలకు చెందిన అధికారులు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆపద మిత్రలపై రోజుకు రూ.500 చొప్పున 12 రోజులకు రూ.ఆరువేలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఆపదలో ఉన్నవారిని రక్షించడానికి, తమను తాము రక్షించుకోవడానికి ప్రభుత్వం రూ.10వేలు విలువ చేసే కిట్లను ఆపద మిత్రలకు అందజేస్తోందని తెలిపారు. ఈ శిక్షణలో రెండు రోజులు ఫీల్డు విజిట్ ఉంటుందన్నారు. ఈటీసీలో కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇప్పటికే కోనసీమ జిల్లా నుంచి 300 మందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. విపత్తుల నివారణ సంస్థ జిల్లా మేనేజర్ కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు వి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, కేఆర్ నిహారిక, ఎస్‌కే మొహిద్దీన్‌లు శిక్షణ నిర్వహించారు.

ఆన్‌లైన్ జాబ్ పేరుతో రూ.5.80 లక్షలకు టోపీ

గోకవరం: ఆన్‌లైన్ జాబ్ పేరుతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ. 5.80 లక్షలు కాజేసిన ఘటనపై గోకవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్ఐ యూవీ శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం గోకవరానికి చెందిన నేతి వీరవెంకట కాశీవిశ్వనాథ్ బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కోవిడ్ కారణంగా కొంత కాలంగా ఇంటి వద్ద నుంచే పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ జాబ్ ఉందని, ఆసక్తి ఉంటే సంప్రదించాలని ఈ నెల 4న అతని వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. గతంలో ఆన్‌లైన్ జాబ్ చేసిన అనుభవం ఉండటంతో మెసేజ్ వచ్చిన నంబర్‌ను సంప్రదించాడు. ఈ క్రమంలో అతని అకౌంట్‌కు రెండు విడతలుగా కొంత నగదు జమ కావడంతో నమ్మకం వచ్చింది. తర్వాత వెబ్‌సైట్‌లో నగదు జమ చేయాలని చెప్పడంతో దఫదఫాలుగా రూ.5.80 లక్షలు వారు చెప్పిన అకౌంట్లకు జమ చేశాడు. కానీ వారు స్పందించకపోవడంతో మోసపోయానని గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఆల్ ఇండియా మహిళా వాలీబాల్ పోటీలు

- విన్నర్‌గా ఇండియన్ రైల్వేస్ బి జట్టు
- రన్నర్‌గా ఇండియన్ రైల్వేస్ ఎ జట్టు




బహుమతులు అందిస్తున్న హైమావతి తదితరులు

మలికిపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెంలో ఐదు రోజులుగా జరుగుతున్న ఆల్ ఇండియా మహిళా వాలీబాల్ ఇన్విటేషన్ పోటీలు గురువారం తెల్లవారు జామున ముగిశాయి. పోటీలలో ఇండియన్ రైల్వేస్ బి. జట్టు విన్నర్‌గా నిలిచి రూ.2లక్షల నగదు బహుమతిని గెలుచుకుంది. ఇండియన్ రైల్వేస్ ఎ. జట్టు రన్నర్‌గా నిలిచి రూ.1.50 లక్షల నగదు బహుమతిని గెలుచుకుంది. కేరళ పోలీస్ జట్టు మూడో స్థానంలో నిలిచి రూ. 75 వేల నగదు, ఎస్‌కేఎం యూనివర్శిటీ చెన్నై జట్టు నాలుగో స్థానంలో నిలిచి రూ.25 వేల నగదు గెలుపొందాయి. సినర్జీస్ ఫార్మర్స్ సంస్థ అధినేత నల్లా సూర్యప్రకాష్ సమకూర్చిన రూ.5 లక్షల నగదు బహుమతులను, ట్రోఫీలను ఆయన భార్య హైమావతి చేతుల మీదుగా అందించారు. అడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్, కోనసీమ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్గనైజింగ్ అధ్యక్షుడు అడబాల వేణుగోపాల్, అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీ, చైర్మన్ అడబాల నాగేశ్వరరావు, సర్పంచ్ గుర్లింక సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఒగ్గు సుబ్బారావు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి రవిరాజు, కోశాధికారి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రత్నగిరిపై విద్యుత్ నామం

18 సంవత్సరాల తరువాత వెలిగిన వైనం



రత్నగిరిపై కాంతులీనుతున్న విద్యుత్ నామం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకటసత్యనారాయణస్వామి వారి దేవస్థానంలో 18 సంవత్సరాలు తరువాత విద్యుత్ నామం గురువారం రాత్రి నుంచి మళ్లీ వెలుగులు విరజిమ్మింది. ఈ నామాన్ని 2004లో ఏర్పాటు చేశారు. అయితే ఒక సంవత్సరం తరువాత ఇది వెలగడం మానేసింది. ఈ రోజు వరకు దానిని ఎవ్వరూ వెలిగించే ప్రయత్నం చేయలేదు. కాగా విజయవాడకు చెందిన కుమార్ ఇంజినీరింగ్ కంపెనీ అధినేతలు పట్టాభిరామన్, అమరేంద్ర విరాళాలతో ఈ నామాన్ని మళ్లీ వెలిగించినట్టు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. సుమారు లక్షా 50వేల రూపాయల వ్యయం అయిందని తెలిపారు. అన్నవరం మీదుగా రోడ్డు, రైలుమార్గాల ద్వారా ప్రయాణించే వారికి సుమారు 10 కిలోమీటర్ల వరకు ఈ విద్యుత్ నామం కనువిందు చేస్తుందని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీబాలకృష్ణ, విద్యుత్‌శాఖ డీఈ టి.సూర్యనారాయణను ఈవో అభినందించారు. ఈ విద్యుత్ నామం 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పున ఏర్పాటు చేశారు.

తుపాకీ వ్యక్తులు జైలుకు

రూ.50 వేలకు కొనుగోలు





నిందితులు సత్యనారాయణ, హరిసూర్య



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తుపాకీతో బెదిరించి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దందా చేసేందుకు బయల్దేరిన స్థానిక కొత్తపేటకు చెందిన కెల్లా సత్యనారాయణ, అతని సహాయకుడు ఆటోడ్రైవర్ అంబళ్ల హరిసూర్యలను పోలీసులు గురువారం సెంట్రల్ జైలుకి తరలించారు. తుపాకీతో బెదిరించి డబ్బులు గుంజేందుకు సిద్ధమైన వారిని బుధవారం అర్ధరాత్రి ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. స్థానిక జాంపేట మార్కెట్‌లో కోడుగుడ్లు అమ్ముకునే సత్యనారాయణకు యూఎస్‌కు చెందిన 9 ఎంఎం పిస్టల్ ఎలా వచ్చిందనే కోణంలో విచారణ చేస్తున్నారు. సత్యనారాయణ ప్రజలను బెదిరించి తేలికగా డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో తుపాకీ కొనుగోలు చేయాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ విషయాన్ని విజయనగరంలోని అతను బావ బొత్స మోహన్‌కు తెలిపాడు. దీంతో వీరు కొద్దికాలం క్రితం ఒడిశా వెళ్లి రూ.50 వేలుకు తుపాకీ కొనుగోలు చేశారు. దీన్ని ఇంటికి తెచ్చుకున్నాడు. తన ఇంటి పక్కనే నివాసముంటున్న ఆటోడ్రైవర్ అంబళ్ల హరిసూర్య, సత్యనారాయణ కలిసి రాత్రుళ్లు ఒంటరిగా తిరుగుతున్న వారిని గుర్తించి డబ్బులు గుంజేందుకు అన్నపూర్ణమ్మపేట ప్రాంతంలో తిరుగుతున్నారు. ఆ సమయంలో వాహన తనిఖీలు చేస్తున్న ఒకటో పట్టణ పోలీసులు వారిని అనుమానించి తనిఖీ చేయగా తుపాకీ బయటపడింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు.

పండగకు వచ్చి వెళ్తూ తిరిగి రాని లోకాలకు...

కృష్ణాజిల్లాలో జరిగిన ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



అడబాల ప్రసాద్ (పాత చిత్రం)

మలికిపురం: పండగకు వచ్చి తిరిగి వెళ్తూ భార్యాభర్తలు ప్రమాదానికి గురయ్యారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం గరిశపూడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మలికిపురం మండలం తూర్పుపాలెం గ్రామానికి చెందిన అడబాల ప్రసాద్ (బుజ్జి) (51) అక్కడికక్కడే మృతిచెందారు. భార్య దేవి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అడబాల ప్రసాద్ విజయవాడలోని ఒక ప్రయివేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. అక్కడే నివాసం ఉంటూ సంక్రాంతి పండగకు స్వగ్రామం తూర్పుపాలెం భార్యతో కలిసి వచ్చారు. గురువారం కారులో తిరుగు ప్రయాణం అయి ప్రమాదానికి గురయ్యారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. అందరితో సరదాగా గడిపి వెళ్లారని అంతలోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు.

భార్యను కొట్టినందుకు కేసు

కొవ్వూరు: మండలంలో ఆరికిరేవుల గ్రామానికి చెందిన నేకూరి కేజియా అనే మహిళను కొట్టి గాయపరచడంతో పాటు ఆమెను చంపుతానని బెదిరించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఆమె భర్త నవీన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. భర్త తనను వేధిస్తున్నాడని, తరచూ కొడుతున్నాడని కేజియా ఫిర్యాదు చేసిందన్నారు. బుధవారం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చేరిందన్నారు. బాధితురాలి ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేశామన్నారు.

ఈ–శ్రమ్‌లో నమోదు చేసుకోండి

సహాయ కార్మిక కమిషనర్ వల్లి వెల్లడి



బీఎస్ఎం వల్లి, సహాయ కార్మిక కమిషనర్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ–శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు కార్యక్రమం జరుగుతోందని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వల్లి అన్నారు. గురువారం ఈ–శ్రమ్ నమోదుకి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ–శ్రమ్ ద్వారా జిల్లాలో 3,15,056 మంది అసంఘటిత రంగ కార్మికులను నమోదు చేశామన్నారు. ఆగస్టు 26వ తేదీ 2021 నుంచి ఈ నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు.

ఉచిత నమోదుకు అర్హులు వీరే...

16 నుంచి 59 ఏళ్ల వయసు కలిగి ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు అవకాశం లేని వారికి, భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషణలో నిమగ్నమైన వారు, బీడీ రోలింగ్, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీలు, రాతి క్వారీలో కార్మికులు, సామిల్లులో పనిచేసేవారు, క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, వార్తాపత్రిక విక్రేతలు, రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు, చర్మశుద్ధి కార్మికులు, వీధి వర్తకులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు అర్హులని తెలిపారు.


నమోదు ఇలా...

ఈ పథకానికి రిజిస్ట్రేషన్ చేసుకొనేవారు ఎటువంటి రుసుం చెల్లించనక్కర్లేదు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబర్ (ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సహా), బ్యాంకు, ఆధార్ కార్డుతో లింకేజీ కలిగిన ఫోన్ నంబర్ ఉండాలి. సమీప సీఎస్‌సీ సెంటర్స్, పోస్టు ఆఫీస్, గ్రామ/వార్డు సచివాలయాలలో చేస్తారు. కార్మిక శాఖ కార్యాలయాలలో లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు.


ఈ పథకం వల్ల లాభాలు...

అసంఘటిత కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను అందించడానికి ప్రభుత్వానికి వీలు ఉంటుంది.

సమాజాన్ని సన్మార్గంలో నడిపేది పీఠాధిపతులే



గాడ్ ఆశీస్సులు పొందుతున్న సాహితీవేత్తలు



జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న డాక్టర్ బేతవోలు రామబ్రహ్మం

- ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ డాక్టర్ శివశంకరరావు
- ఘనంగా గాడ్ 87వ జన్మదిన వేడుకలు

రాయవరం: మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి, సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించేది పీఠాధిపతులేనని ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ బులుసు శివశంకరరావు పేర్కొన్నారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) 87వ జన్మదిన వేడుకలు గురువారం పీఠంలో ఘనంగా నిర్వహించారు. ప్రసారభారతి రిటైర్డ్ డీడీ, ప్రముఖ సాహితీవేత్త ఆర్.అనంత పద్మనాభరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ శివశంకరరావు మాట్లాడుతూ గాడ్ ఇచ్చే సందేశాన్ని మన జీవితాలకు అన్వయించుకుని మంచి మార్గంలో నడవాలన్నారు. పీఠంతో తనకు మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. మహా సహస్రావధాని, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞాన ప్రకాశాన్ని అందించేవాడే గురువుగా పేర్కొన్నారు. టీటీడీ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ ధర్మ పరిరక్షణకు కృషిచేస్తున్న పీఠాల్లో విజయదుర్గా పీఠం ఒకటిగా నిలుస్తుందన్నారు. సమావేశంలో టీటీడీ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కేదార్‌నాథ్ ధామ్ ప్రధాన అర్చకులు శివశంకరలింగ్, వారణాసి కాశీవిశ్వనాథ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ మిశ్రా, టీటీడీ ఆస్థాన సిద్ధాంతి దైవజ్ఞ తంగిరాల వెంకటకృష్ణపూర్ణప్రసాద్, ప్రముఖ వస్త్ర వ్యాపారి తుమ్మిడి రామ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, టీటీడీ అవధాన చక్రవర్తి డాక్టర్ మేడసాని మోహన్, సాహితీవేత్తలు చిలకపాటి విజయరాఘవాచార్యులు మాట్లాడుతూ విజయదుర్గాపీఠం ఆధ్యాత్మికతకు కేంద్ర బిందువుగా భాసిల్లుతోందన్నారు. పీఠం తరఫున ఉత్తమ విశిష్ట దంపతుల పురస్కారాన్ని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక దంపతులకు, జీవన సాఫల్య పురస్కారం సాహితీవేత్త డాక్టర్ బేతవోలు రామబ్రహ్మంకు అందజేశారు. సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ, పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు సభా నిర్వహణ చేశారు.

ధర్మ, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ ధర్మ, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, మంచి ఆలోచనలు చేసేవారికి దైవకృప తోడుగా ఉంటుందని పీఠాధిపతి గాడ్ అన్నారు. భక్తులనుద్దేశించి ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ మంచి పనులు చేసే వారికి అమ్మదయ ఎన్నడూ ఉంటుందన్నారు. లోక కల్యాణం కోసం నిత్యం పీఠంలో అనేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు గాడ్ తెలిపారు. భక్తులు గాడ్‌ను ఘనంగా సత్కరించి, పాదపూజ చేసుకున్నారు.